
# డ్రాఫ్టోపాఖ్యానం




**నే**ను ఆఫీసుకి బయల్దేరబోతూండగా వచ్చాడు శాయిరామ్.

"గురూ నీతో పని పడింది?" అన్నాడు తాపీగా.

"ఈ వారం రోజులు నేను కాలనీ మీటింగులకి రాను- అన్నాను నిష్కర్షగా.

"అబ్బే అదికాదు గురూ! నీ ఫ్రెండెవరో మన కాలనీ బయట బాంక్‌లో ఉన్నారన్నావ్ కదా! ఆ బాంక్‌లో చిన్న పని పడింది."

"ఏమిటది?"

"నేను మా అంకుల్ ఒకాయనకి ఎప్పుడో సంవత్సరం క్రితం రెండు వందల రూపాయలకు డ్రాఫ్ట్ పంపించాను- ఈ మధ్య ఆయన చనిపోయారు గానీ డ్రాఫ్ట్ మాత్రం ఇంకా చేరలేదు-"

"ఎందుకని? పోస్టల్ వాళ్ళతో నీగ్గానీ మీ అంకుల్‌కిగానీ ఏమైనా విరోధం ఉందా?"

"అదేం లేదు- పోస్ట్‌మెన్ ఎక్కడ కనిపించినా చాయ్ ఆఫర్ చేస్తుండేవాడు"

"ఇంతకూ ఇప్పుడు గొడవేంటి?"

"ఆ డ్రాఫ్ట్ పోయింది కాబట్టి కాన్సిల్ చేయించి నా డబ్బు నేను తీసుకోవాలి."

"ఓశ్ ఇంతేనా? దీనికి పేద్ద రాద్ధాంతం ఏముంది? పద-" అన్నాను.

ఇద్దరం బాంక్ కెళ్ళాం.

మా ఫ్రెండ్ కూర్చునే స్థలంలో ఓ లావుపాటి వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

"ఇక్కడ రవి అని మా ఫ్రెండ్ ఉండాలి- ఏరండీ?" అడిగానతనిని.

"ట్రాన్స్‌ఫర్‌యి వెళ్ళిపోయారు-" అనేసి అక్కడినుంచి లేచి లోపలికెళ్ళిపోయాడు.

"ఏం చేద్దామంటావ్ గురూ?" అడిగాడు శాయిరామ్.

"పద మేనేజర్‌తో మాట్లాడదాం- తెలిసినవాళ్ళు లేకపోతేనేం?" అన్నాను- ఇద్దరం మేనేజర్ గదిలోకెళ్ళాం.

అప్పటికే ఓ వ్యక్తి కూర్చున్న ఉన్నాడు మేనేజర్ ముందు.

వాళ్ళ మధ్యలో టేబుల్ మీద ఓ కాగితంలో ముత్యాలు ఉన్నాయ్.

"ఇవి బాగున్నాయ్- కన్సెషన్‌లో ఇస్తావా?" అడిగాడు మేనేజర్ అతనిని- ఆ ముత్యాలు తీసుకుని చూస్తూ.

"మీకంటే ఎక్కువముంది సార్- ఎన్ని కావాలంటే అన్ని తీసుకోండి-"

"థాంక్యూ థాంక్యూ" అని వాటిని తీసుకోబోయి మావేపు చిరాగ్గా చూశాడు.

"యస్? ఏం కావాలి?"

"మావాడికో సమస్య వచ్చింది - మీరేమయినా సహాయం చేయగలరే మోనని," అన్నాడు-

"ష్యూర్, ష్యూర్- ఏమిటది?"

"మావాడు సంవత్సరం క్రితం ఇక్కడే ఒక డ్రాఫ్ట్ తీసుకున్నాడు- అది మిస్ అయినట్లు ఈ మధ్యనే తెలిసింది కనుక మా మొత్తం మాకిప్పిస్తే-"

మా మాట వినిపించుకోకుండా ఫోన్‌తీసి ఎక్కడికో డయల్ చేశాడతను.

"హలో" అంది అవతలి గొంతు.

"చూడండి - సెల్వరాజ్ అనీ పెరల్స్ మర్చెంట్. చాలా మేలిరకం ముత్యాలు, డైమండ్స్ వున్నాయ్ అతని దగ్గర. మనకి కన్సెషన్‌లో ఇవ్వటానికి వప్పుకున్నాడు. అతనిదేదో మెయిల్ - ట్రాన్స్‌ఫర్ ఉందంట- కొంచెం చూడండి"

"మరి మాకూ కన్సెషన్‌లో ఇస్తాడా?" అవతలి అధికారి అడిగాడు.

"ఎందుకివ్వడు? బాంక్‌స్టాఫ్ అంటే చాలు! చాలా కన్సెషన్ ఇస్తాడు-"

"అయితే ఓకే" అనేసి ఫోన్ పెట్టేశాడు.

"థాంక్యూ సార్– మీరడిగినవన్నీ సాయంత్రానికి తెప్పిస్తాను–" అంటూ వెళ్ళిపోయాడా వ్యక్తి.

మేనేజర్ మళ్ళీ మావేపు చిరాగ్గా చూశాడు.

"యస్?" అన్నాడు ప్రశ్నార్థకంగా,

"అదేనండీ– ఇందాక చెప్పాంకదా?"

"ఏం చెప్పారు?"

"మావాడి డ్రాఫ్ట్ సంగతి–"

"ఏమయింది డ్రాఫ్ట్‌కి–"

"ఇక్కడ డ్రాఫ్ట్ తీసుకుని – రెండొందలకి – మా అంకుల్‌కి పంపించాం– అది ఆయనకు చేరలేదు–"

"దానికి మేమేం చేస్తాం– పోస్టల్ డిపార్ట్‌మెంట్‌ని కంటాక్ట్ చేయండి"

"ఆ వ్యవహారమంతా అయిపోయింది లెండి– ఇప్పుడు మాక్కావలసిందేమిటంటే మా డ్రాఫ్ట్ కాన్సిల్ చేసి మా డబ్బు మాకివ్వటం–"

మళ్ళీ ఫోన్ మోగింది.

"హలో– ఓ– మీరా– ప్రపోజల్ ఇంకా రాలేదు రీజనల్ ఆఫీస్ నుంచి! అక్కడ కెళ్ళి కొంచెం– ఏదయినా చేస్తే త్వరగా వచ్చేస్తుంది... అన్నట్లు మళ్ళీ స్టాకొచ్చిందా? సరే వస్తే రెండు నాకోసం తీసిపెట్టండి–" ఫోన్ పెట్టేశాడు.

"యస్!" అని మా వంక ప్రశ్నార్థకంగా చూశాడు మళ్ళీ.

"మావాడి డ్రాఫ్ట్...."

"ఓహెూ డ్రాఫ్ట్ పోయిందన్నారు కదూ?"

"అవునండీ–"

"అయితే అప్లికేషన్ రాసివ్వండి! డూప్లికేట్ డ్రాఫ్ట్ ఇస్తాను–"

"మాకు డూప్లికేట్ అవసరం లేదండీ–"

"మరి?"

"మా డబ్బు మాకిప్పించేయాలి"

"అలాగా అయితే సరే– ఆ సంగతే అప్లికేషన్ రాసివ్వండి–"

మేము బయటికొచ్చి డెస్క్ మీద ఓ అప్లికేషన్ తయారుచేసి మళ్ళీ లోపలికెళ్ళాం–

"యస్?" అన్నాడాయ ప్రశ్నార్థకంగా.

అప్లికేషన్ అతని చేతిలో ఉంచాం. అది చూసి అదిరిపడ్డాడు.

"వాట్? సంవత్సరన్నర క్రితం డ్రాఫ్టా?"
"అవునాండి!"
"మరాసంగతి చెప్పరేం?"
"రెండుసార్లు చెప్పామండి!"
"ఎవరికి?"
"మీకేనండీ!"
"సంవత్సరన్నర క్రితం డ్రాఫ్ట్ పోతే మీరు ఇంతకాలం ఎందుకూరుకున్నారు?"
"అది నేను పంపిన వ్యక్తికి ఎప్పటికయినా చేరుతుందనుకున్నానండీ–"
"మరింకా వెయిట్ చేయకుండా ఇప్పుడెందుకొచ్చారు?"
"మా అకుల్ చనిపోయారండీ–"
"చనిపోయాడా?"
"అవునండీ! స్కూటర్ యాక్సిడెంట్–"
"అరెపాపం! అందుకే స్కూటర్, మోటార్‌సైకిళ్ళూ ఎక్కకూడదు–"
"అవునండీ–"
"బస్‌లో వెళ్ళాలి – లేదా నడిచి తిరగాలి–"
"మా ఇంకో అంకుల్ నడిచి వెళ్తోంటే లారీ వచ్చి కొట్టేసిందండీ–"
"అలాగా"
"అవునండీ–"
"అందుకే మనం నడవకూడదు–"
"అవునండీ–"
"అయితే సరే – ఓ పనిచేయండి! ఇక్కడికి కిలోమీటర్ దూరంలో మా క్లియరెన్స్ ఆఫీస్ ఉంది. అక్కడికి వెళ్ళి ఈ నెంబరుగల డ్రాఫ్ట్ అవుట్ స్టాండింగ్‌లో ఉందా, లేదా అనే విషయం కనుక్కురండి–"
నేనూ శాయిరామ్ క్లియరెన్స్ ఆఫీస్ వెతుక్కుంటూ బయల్దేరాం. గంటసేపు వెదికాక ఓ పెద్ద బిల్డింగ్‌లో గోడౌన్ లాంటి చోట దొరికింది.
అక్కడి మేనేజర్ దగ్గరకెళ్ళి సంగతంతా చెప్పాం.
"అలాగా– పాపం దానికోసం వచ్చారా?" అన్నాడు జాలిగా.
"అవునండీ!"
"సంవత్సరన్నర క్రితం దయితే ఇప్పుడు వెదకటం చాలా కష్టమండీ–"
"అయితే ఏం చేద్దామంటారు?"

"ఓ వారం రోజులాగిరండి! మా వాళ్ళు వెతికి ఉంచుతారు–"

మేము కాగితం మీద డ్రాఫ్ట్ వివరాలు రాసిచ్చి తిరిగి కాలనీలోకి చేరుకున్నాం. వారం రోజుల తర్వాత మళ్ళీ వెళ్ళాం.

"ఆ క్లర్క్ శెలవులో ఉన్నాడండీ రేపురండి!" అన్నాడతను.

మర్నాడు మళ్ళీ వెళ్ళాం.

ఓ రెండు గంటలు బయట కూర్చోపెట్టాక చెప్పాడతను.

"అవుట్ స్టాండిగ్‌లోనే ఉందని చెప్పండి"

మళ్ళీ బాంక్‌కి చేరుకున్నాం. మేనేజర్ మళ్ళీ 'యస్" అంటూ మావేపు చూశాడు.

"మీరు చెప్పినట్లు క్లియరెన్స్ ఆఫీస్‌కెళ్ళి తెలుసుకున్నామండీ. అది అవుట్ స్టాండింగ్‌లోనే ఉందని చెప్పారు వాళ్ళు–"

"ఏ విషయం మాట్లాడుతున్నారు మీరు?"

మళ్ళీ కథంతా చెప్పాను.

"సరే– అయితే ఈ సంగతంతా డూప్లికేట్‌లో ఓ అప్లికేషన్ రాసివ్వండి–"

ఇద్దరం బయట కూర్చుని అప్లికేషన్ రెండు కాపీలు ఆయన కిచ్చాం.

"మీరు వారం రోజులు ఆయాకరండి" అన్నాడతను.

ఎందుకయినా మంచిదని పదిరోజుల తరువాత వెళ్ళాం.

"యస్?" అన్నాడతను అలవాటు ప్రకారం. అలవాటు ప్రకారం శాయిరామ్ కథంతా చెప్పాడు.

"ఓ! అదా అది ఆఫీసర్‌ని కాంటాక్ట్ చేయాలి! నన్ను కాదు–" అన్నాడు చిరాగ్గా ఇద్దరం ఆఫీసర్ దగ్గరకు వెళ్ళాం.

"ఏం కావాలి?

అతనికి మళ్ళీ కథంతా చెప్పాము.

"ఓహో– అదా–"

"అవునండీ! అదే–"

"దానికి లెటర్ పంపించామండీ– ఇంకా జవాబు రాలేదు–"

"ఎవరికి పంపించారండీ–"

"మా క్లియరెన్స్ ఆఫీస్‌కి?"

"లోకల్ లెటర్‌కి వారం రోజులు టైమ్ పడుతుందా?"

"పట్టదుకానీ– ఒకోసారి పడుతుంది– అంచేత ఓ వారం ఆగండి–"

మళ్ళీ వారం తర్వాత వెళ్ళాము.

"ఇంకా రిప్లయ్ రాలేదే–" అన్నాడతను మళ్ళీ కథంతా విన్నాక.

"ఇకవేళ లెటర్ పోస్ట్‌లో మిస్సయిందేమో–"

"మేము అందుకే లోకల్ లెటర్స్ అన్నీ మెసెంజర్ ద్వారా పంపిస్తాము. పోస్ట్‌లో పంపం–"

"ఇప్పుడేం చేయమంటారు?"

"ఇంకో నాలుగు రోజులు–"

నాలుగు రోజుల తర్వాత మళ్ళీ వెళ్లాము.

మళ్ళీ కథంతా చెప్పాడు శాయిరామ్.

"ఓ పని చేస్తారా?" జాలిగా అడిగాడతను.

"లక్ష పనులు చేస్తామండీ! ఒకటేమిటి?"

"మీరే స్వయంగా మా క్లియరెన్స్ ఆఫీస్‌కెళ్ళి మా లెటర్‌కి ఎందుకు రిప్లయ్ ఇవ్వలేదు అని అడగండి–"

"సరే–"

కాళ్ళీడ్చుకుంటూ క్లియరెన్స్ ఆఫీసుకి చేరుకున్నాం.

"అబ్బే– వాళ్ళ దగ్గర్నుంచి మాకు లెటరేమీ రాలేదు మా ష్టారూ– వస్తే మేము రిప్లయ్ ఇవ్వకుండా ఎందుకుంటాం?"

"అదేమిటండీ! మీ మనిషే స్వయంగా టపా తెస్తాడు కదా. ఎలా మిస్సవుతుంది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇదిగో ఇప్పుడీ లెటరు మిస్సయినట్లే–" అన్నాడతను.

"అంటే ఆరోజు వాళ్ళు పంపించిన టపా అంతా ఎక్కడో పోయి ఉంటుంది! అంతే?"

"ఎగ్జాక్ట్‌లీ–"

"అంటే ఇప్పుడిక మేము కట్టిన డబ్బు మాకు రాదంటారు."

"అయ్యో – ఎందుకివ్వమండి ఇస్తాం కానీ–"

"ఓపట్టాన్న ఇవ్వరు– అంతేగా–"

"మీరో పని చేయండి– మా బాంక్ కెళ్ళి వాళ్ళు మీ డ్రాఫ్ట్ గురించి మాకు పంపిన లెటర్ కాపీ తీసుకురండి–"

మళ్ళీ బాంక్‌కి చేరుకున్నాం 'యస్' అంటూ ప్రశ్నించారు ఆఫీసర్.

కథంతా చెప్పాడు శాయిరామ్.

"మీరు పంపించిన లెటర్ వాళ్ళకి చేరలేదట! అందుకని ఆ లెటర్ కాపీ తెమ్మన్నాడు"

"ఆశ్చర్యంగా వుందే లెటర్ చేరకపోవటం ఏమిటి?"

"ఇందులో మాకేం ఆశ్చర్యం కనిపించటం లేదు. చాలా నేచురల్‌గా వుంది."

అతను రెండు గంటలసేపు ఆ లెటర్ కోసం వెతికి కాపీ చేసి ఇచ్చాడు.

అది తీసుకుని మళ్ళీ క్లియరెన్స్ ఆఫీస్ కెళ్లాము.

ఆ లెటర్ చూసుకున్నాక "ఓకే మేము రిప్లయ్ పంపిస్తాంలెండి–" అన్నాడతను.

"ఎప్పుడండీ?"

"రేపే"

"పోనీ ఆ రిప్లయ్ ఏదో మాకు రాసిస్తే–"

"అలా వీలుపడదండీ– మా రూల్స్ ఒప్పుకోవు"

రెండురోజుల తర్వాత మళ్ళీ బాంక్ కెళ్లాము.

"ఇంకా రాలేదే మీ డ్రాఫ్ట్ తాలూకూ లెటర్–" అన్నాడు ఆఫీసర్.

"మొన్నే పంపుతానన్నాడండీ అతను"

"కానీ పంపలేదుకదా మరి"

ఇక మాట్లాడి లాభం లేదని మళ్ళీ క్లియరెన్స్ ఆఫీస్ కెళ్ళాము.

"ఏమిటి మళ్ళీ వచ్చారు?" అడిగాడతను ఆశ్చర్యంగా.

"అదే మీరు పంపిన లెటర్ రాలేదని అన్నారు బాంక్‌లో"

"అబ్బే ఆ రోజే పంపించేశాం–"

"మరిప్పుడెలా – అదీ మిస్ అయిపోయి ఉంటుంది"

"అవును"

"పోనీ– మీ రిప్లయ్ కాపీ ఒకటి ఇస్తే"

"సరే – రేపు రండి"

మర్నాడు వెళ్ళి కాపీ తీసుకుని బాంక్‌కి చేరుకున్నాం.

"మంచి పనిచేశారు. లేపోతే ఓ పట్టాన తేలిచావదది" అన్నాడతను లెటర్ తీసుకుంటూ.

"అవునండీ."

"మరి స్టాంప్ పేపర్ తెచ్చారా?" అడిగాడతను.

నేను ఉలిక్కిపడ్డాను.

"అదేమిటి? స్టాంఫ్ పేపరెందుకు?"

"అయిదు రూపాయల స్టాంప్ పేపర్ మీద మేటర్ రాసి సంతకం పెట్టి ఇవ్వాలి కదా!"

"మా డబ్బుకి మేమే బాండ్ రాయాలా?"

"రూల్స్ బాబూ– రూల్స్–"

"మరీ విషయం ముందే - చెప్తే నిన్నే రడీ చేసుకువచ్చే వాళ్ళంకదా"

"మీరు ముందే అడిగివుంటే ముందే చెప్పేవాళ్ళం–"

""మరీ ఇంక చెత్తరూల్స్ వుంటాయని మేమనుకోలేదు."

"బాంక్ అన్నాక లేకుండా ఎలా వుంటాయండీ?"

"సరే స్టాంప్ పేపర్ తెస్తాం– అందులో లెటర్ ఏం రాయాలో రూల్స్ చూసి చెప్పండి."

అతను ఓ కాగితం కట్టను గంటసేపు వెతికి ఓ కాగితం తీసి ఇచ్చాడు. అయిదు రూపాయల స్టాంప్ పేపర్‌కోసం హైద్రాబాద్ అంతా తిరిగి చివరకు బాగా పొద్దుపోయాక దొరకదని తెలుసుకుని మర్నాడు కోర్టు ఆవరణలోవున్న ఓ వ్యక్తి దగ్గర స్టాంప్ పేపర్ తీసుకుని మేటర్ టైప్ చేయించి బాంక్‌కి చేరుకున్నాం. అతను కాగితం అంతా ఓసారి చదువుకున్నాడు.

"సరే– ఇవాళ ఎలాగూ టైమయిపోయింది రేపు రండి–" అన్నాడు.

మర్నాడు సంతోషంగా బాంక్‌కెళ్ళాం ఆ రోజుతో మమ్మల్ని ఆవహించిన శని వదిలిపోయింది కదాని. గంటసేపు కూర్చున్నాక ఓ క్లర్కు మమ్మల్ని పిలిచాడు.

"ఇక్కడ సంతకం చేయండి" అక్కడ సంతకం చేశాడు శాయిరామ్.

అతను ఓ డ్రాఫ్ట్ శాయిరామ్ చేతికిచ్చాడు–

"ఇదేమిటి?" ఆశ్చర్యంగా అడిగాం.

"డూప్లికేట్ డ్రాఫ్ట్. ఒరిజినల్ పోయిందన్నారుగా"

"కానీ మేమడిగింది డూప్లికేట్ డ్రాఫ్ట్ కాదు– పోయిన డ్రాఫ్ట్ కాన్సిల్ చేసి డబ్బు ఇమ్మన్నాం."

"అలాగా! మరి మా ఆఫీసర్‌గారు అలా చెప్పారేం?"

"ఎలా చెప్పారు?"

"ఇలా." మళ్ళీ ఆఫీసర్ దగ్గర కెళ్ళాం.

"యస్?" అన్నాడతను ప్రశ్నార్థకంగా. అని శాయిరామ్ వంక చూశాడు. నేనూ శాయిరామ్ వంక చూశాను.

మా ఇద్దరికీ అర్థమయిపోయింది. కథ మళ్ళీ మొదలయిందని. ఆ డ్రాఫ్ట్ మళ్ళీ కాన్సిల్ చేసి డబ్బు తీసుకోవాలంటే మళ్ళీ ఆ కథంతా జరగాలి. శాయిరామ్ చిరునవ్వు నవ్వాడు.

"మరేం లేదు సార్ - థాంక్స్ చెప్దామని"

"ఏం ఫర్లేదు– మీ సేవకోసమే మా బ్యాంక్‌లున్నయ్. వెల్‌కమ్– ఆల్వేస్ వెల్‌కమ్–"




బయటికొచ్చాక శాయీరామ్ డ్రాఫ్ట్ ముక్కలు ముక్కలుగా చింపి పారేశాడు. మర్నాడు పొద్దున్నే శాయిరామ్ వచ్చి తలుపుకొట్టాడు. "మళ్ళీ ఏమిటి?" అన్నాడు కోపంగా.

"ఈ ఫార్స్ చూశావా?" అన్నాడు పేపర్లో ఓ బాక్స్ అయిటమ్ చూపిస్తూ.

"ఏమిటది?"

"మనం ఇన్ని రోజులూ తిరిగిన బ్యాంక్ ఉంది చూడు – అక్కడి మేనేజర్నీ స్టాఫ్నీ మోసం చేసి మెయిల్ ట్రాన్స్ఫర్ అరవై లక్షలు కొట్టేశాడు ఒక ముత్యాలు, వజ్రాలు అమ్మే బిజినెస్మెన్–"

"అందులో కొత్తేముందీ? బాంక్ని ముంచనోడెవ డీరోజుల్లో."

"అది నిజమేగాని ఈ ముత్యాల వర్తకుడెవరో గుర్తుకొచ్చిందా?"

"లేదే– ఎవరు?"

"అదే మనం మొదటిరోజు డ్రాఫ్ట్కోసం బాంక్ కెళ్ళినప్పుడు మేనేజర్కి ముత్యాలు కన్సెషన్లో యిస్తానని చెప్తాడు చూడు–"

"అవునవును! గుర్తుకొచ్చింది– మనెదురుగ్గానే మేనేజర్ ఫోన్ చేశాడు స్టాఫ్కి– అతని వ్యవహారం వెంటనే ఓకే చేయమని"

"వాడే వాళ్ళను ముంచేశాడు– కేవలం కొన్ని ముత్యాలు దానాగా చల్లి. అదే మనలాంటి పక్షులు వెళ్తే మన డబ్బు మనకివ్వటానికి సవాలక్ష రూల్స్ అడ్డం వస్తాయ్– ముత్యాలు జల్లే వాళ్ళకు సలాంకొట్టి తప్పుకుంటాయ్–"

నేనేం మాట్లాడలేదు.

* * * * *